నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, సోమవారం 15 ఏప్రిల్ 2024 | MEDAK

సుల్తాన్‌పూర్‌లో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు


జహీరాబాద్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పక్కన జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్

హామీలు నెరవేర్చే వరకూ ఉద్యమిస్తాం

- రైతాంగ సమస్యలపై సెక్రటేరియట్‌ను ముట్టడిస్తాం
- వంద రోజులు గడిచినా రుణమాఫీ.. బోనస్‌లేదు
- 16న కేసీఆర్ బహిరంగ సభను జయప్రదం చేయాలి
- మహిళలు, రైతులు, నిరుద్యోగులు, యువత తరలిరావాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

చౌటకూర్, ఏప్రిల్ 14: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకూ ఉద్యమిస్తామని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా పోస్టుకార్డు ఉద్యమం చేపడుతామన్నారు. ఈనెల 16న సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ శివారులో సింగూరు చౌరస్తా వద్ద బహిరంగ సభ ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యే లోపు రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డులు రాయాలని, ఈ విషయంలో గ్రామాల్లో రైతులకు పార్టీ కార్యకర్తలు సహకరించాలన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కల్లాల వద్దనే రూ.1600, రూ. 1700లకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోకుంటే సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. వంద రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని సీఎం రేవంత్ ప్రకటించినా ఆచరణలో సాధ్యం కాలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు దొందు దొందేనని, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉండకూడన్న కుట్రలు చేస్తున్నాయని, ఆ కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోకపోతే ఢిల్లీలో జై తెలంగాణ అనేవారు లేకుండా పోతారన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, మిషన్ కాకతీయతో చెరువులు, కుంటల అభివృద్ధి, ప్రాజెక్టు పనులు పూర్తి చేశామన్నారు. నాణ్యమైన విద్యుత్‌ను 24 గంటల పాటు సరఫరా చేసి వ్యవసాయాన్ని పండుగలా మార్చామన్నారు. కేంద్రంలో బీజేపీ పదేండ్ల పాలన, కాంగ్రెస్ పార్టీ నాలుగు నెలల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. మెదక్, జహీరాబాద్ లోక్‌సభల పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున మహిళలు, రైతులు, నిరుద్యోగులు, యువత తరలివచ్చి కేసీఆర్ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు పట్లోళ్ల జైపాల్‌రెడ్డి, ఎంపీపీ వైస్ ఎంపీపీ గాజుల వీరేందర్, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, పల్లె సంజీవయ్య, బుచ్చిరెడ్డి, పట్నం మాణిక్యం, నారాయణ, డీబీ నాగభూషణం, వెంకటేశం, శివకుమార్, విజయ్‌కుమార్, మల్లారెడ్డి, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల మోసానికి శిక్ష తప్పదు

- 16న కేసీఆర్ సభకు తరలిరండి
- బీజేపీ ఎంపీ అభ్యర్థికి బుద్ధి చెప్పాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

నారాయణఖేడ్, ఏప్రిల్ 14: ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో శిక్ష తప్పదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఈనెల 16న అందోల్ నియోజకవర్గం సుల్తాన్‌పూర్ వద్ద నిర్వహించనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభ నేపథ్యంలో ఆదివారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో కోత పెడుతుందన్నారు. బీజేపీ ప్రకటించిన మ్యానిఫెస్టో పేదలు, రైతులకు ఏమాత్రం మేలు చేసే విధంగా లేదన్నారు. రాష్ట్రంలో ఎస్సీలకు కేటాయించిన మూడు ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ ఒక్క స్థానంలో కూడా మాదిగ అభ్యర్థిని నిలబెట్టలేదన్నారు. జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను బీఆర్ఎస్ రెండుసార్లు ఎంపీగా అవకాశం కల్పిస్తే మోసం చేసి బీజేపీలో చేరారని, ఓటుతో ప్రజలు బుద్ధి చెపాలన్నారు. గురుకులాలు, మార్కెట్ యార్డు, రోడ్లు, సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసి 'ఖేడ్' నియోజకవర్గ రూపురేఖలు పూర్తిగా మార్చామన్నారు. కారు గుర్తుకు ఓటువేసి గాలి అనిల్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కేసీఆర్ సభకు 20వేల మంది జనసమీకరణ చేయాలనే లక్ష్యంతో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా నాయకులు మఠం భిక్షపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- ఆరు గ్యారెంటీలపై పోస్ట్ కార్డు ఉద్యమం
- పథకాల అమలుపై చర్చకు సిద్ధం
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

కోహీర్, ఏప్రిల్14: మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కోరారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లోగా వాటిని అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఇందుకు జహీరాబాద్ వేదిక అయ్యిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి లక్షలాదిగా పోస్ట్‌కార్డులు పంపించాలన్నారు. పోస్ట్‌కార్డు ఉద్యమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలని కోరారు. రైతుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ చేస్తున్న మోసాల గురించి వివరించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోగా రూ.2లక్షల రుణమాఫీ, ధాన్యం, శనగలు, మక్కలకు రూ.500 బోనస్ ఇవ్వాలని, లేకుంటే రైతులు కర్రుకాల్చి వాత పెడతారన్నారు. హామీలు అమలయ్యే వరకు కాంగ్రెస్ పార్టీని విడిచి పెట్టమన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అన్యాయంగా, అక్రమంగా కేసులు పెడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రైతులు, వృద్ధులు, మహిళలు, నిరుద్యోగులను మోసం చేయడమే కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. కల్యాణలక్ష్మి చెక్కులు, కేసీఆర్ కిట్లు కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు.

బీజేపీ చేసిందేమీలేదు..

బీజేపీ పదేండ్లలో ఏ ఒక్క వర్గానికి న్యాయం చేయలేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. దేశంలో 150 మెడికల్ కాలేజీలు, 150 నర్సింగ్ కాలేజీలను మంజూరు చేస్తే తెలంగాణకు ఒక్క కాలేజీని కూడా కేటాయించలేదని బీజేపీ పనితీరుపై మండిపడ్డారు. జిల్లాకు ఒకటి ఉండాల్సిన నవోదయ పాఠశాల తెలంగాణకు ఒక్కటి కూడా మంజూరు చేయలేదన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అని చెప్పిందని పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ కేవలం ఆరు లక్షల ఉద్యోగాలను కల్పించి చేతులు దులుపుకుందని విమర్శించారు. పదేండ్ల బీజేపీ పాలన, నాలుగు నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. పథకాలపై చర్చకు రావాలని కాంగ్రెస్‌కు సవాల్ విసిరారు. కాంగ్రెస్ హయాంలో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని ఆరోపించారు. కానీ 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో మార్చి 31వ తేదీన 8వేల మంది ఉద్యోగులు రిటైర్డ్ అయ్యారని గుర్తుచేశారు. వారికి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్లు అందించాలన్నారు. ఉద్యోగులకు నాలుగు డీఏలను అందించడంతో పాటు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, బెవరేజెస్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, దశరథ్‌రెడ్డి, నామ రవికిరణ్‌గుప్తా, స్రవంతిరెడ్డి, రామకృష్ణారెడ్డి, గుండప్ప, రాజశేఖర్, రవికిరణ్, నర్సింహులు, వెంకటేశం, నారాయణ, యాకూబ్, బండి మోహన్, ఆనంద్, దత్తాత్రి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.


జహీరాబాద్‌లో పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

అందోల్ నియోజకవర్గంలో ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కోరారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి 20వేల మందికి పైగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ నిర్వహించిన చేవెళ్ల, కరీంనగర్ బహిరంగసభలు విజయవంతమయ్యాయన్నారు. జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్, పటాన్‌చెరు, సంగారెడ్డి, నర్సాపూర్ నుంచి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని సూచించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం అందరినీ మోసం చేసిందని, ఇందుకు పోస్ట్ కార్డు ఉద్యమం ప్రారంభిస్తున్నామని మాజీ మంత్రి ప్రకటించడంతో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో జై తెలంగాణ నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రఘునందన్ మాటలు నమ్మొద్దు

జగదేవ్‌పూర్‌లో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, పక్కన ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

- మెదక్ నియోజకవర్గాన్ని అన్నింటా ముందుంచుతా
- కేసీఆర్ సారథ్యంలో గజ్వేల్ 50 ఏండ్లు ముందుకు ..
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

జగదేవ్‌పూర్, ఏప్రిల్14: ''జగదేవ్‌పూర్, మర్కుక్ మండలాల్లో పర్యటించి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నా, నేడు ఎంపీ అభ్యర్థిగా మీ ముందుకొచ్చా ఆదరించి ఆశీర్వదించాలి'' అని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. జగదేవ్‌పూర్, మర్కుక్ మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మండల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కేసీఆర్ సహకారంతో గజ్వేల్ అభివృద్ధిలో 50 ఏండ్లు ముందుకెళ్లిందన్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. తనకు ఓటేసి గెలిపిస్తే రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేసి ప్రతి నియోజకవర్గంలో ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేసి ఉచితంగా సేవ లందిస్తానన్నారు. నిరుద్యోగ యువత స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ అమలుచేయలేదని, ఇప్పటికే ప్రజల్లో కాంగ్రెస్, బీజేపీపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపించుకోవాలన్నారు. రఘునందన్ మాయ మాటలు నమ్మవద్దని సూచించారు. బీఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసేలా చూడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మర్కుక్ ఎంపీపీ పాండుగౌడ్, జడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, మంగమ్మారామచంద్రం, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, కొండపోచమ్మ దేవాలయ మాజీ చైర్మన్లు శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, నాయకులు యాదవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, వేదికపై బీఆర్ఎస్ నాయకులు

మెదక్ గడ్డ.. గులాబీ అడ్డా

- 100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేస్తా
- మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి
- తూప్రాన్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

తూప్రాన్, ఏప్రిల్ 14: మెదక్ గడ్డ.. గులాబీ అడ్డా అని మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం తూప్రాన్‌లో జడ్పీటీసీ రాణీ సత్యనారాయణగౌడ్ అధ్యక్షతన జరిగిన తూప్రాన్‌టౌన్, మండల (రూరల్), మనోహరాబాద్ మండలాల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాతో సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విజన్‌తో గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధిలో 50 ఏండ్లు ముందుకు దూసుకుపోయిందన్నారు. పేదలు, మహిళలు, యువతకు సేవ చేయాలనే లక్ష్యంతో రూ. 100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేస్తానన్నారు. యువత ఉపాధికి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి తదనంతరం జాబ్ మేళాల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకుల కోసం ఏడు నియోజకవర్గాల్లో ఫంక్షన్ హాళ్లు నిర్మించి కేవలం ఒక్క రూపాయి నామమాత్రపు రుసుముకే అందిస్తానన్నారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కులం, మతం పేరుతో బీజేపీ నాయకులు ఓట్లు అడగడానికి వస్తున్నారని, వారి మాటలను నమ్మవద్దన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అమలు చేయడంలో చతికిల పడిందన్నారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, తూప్రాన్ మండల అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సతీశ్ చారి, మనోహరాబాద్ ఎంపీపీ నవనీతారవి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు మాచిరెడ్డి కృష్ణారెడ్డి, ఎక్కలేవ్ వెంకటేశ్ యాదవ్, చక్రవర్తి, పల్లె చంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్, కుమ్మరి రమేశ్, గుమ్మడి శ్రీనివాస్, అంజాగౌడ్, షేక్ సత్తార్, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు బురాన్, నాగరాజు, అహ్మద్, మహేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్‌లో సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

సేవకుడిగా వస్తున్నా.. ఆశీర్వదించండి

కరువు నేలపై గోదావరి జలాలు పారించిన ఘనత కేసీఆర్‌దే

- హామీలు నెరవేర్చలేనివాళ్లు ఓట్లు ఎలా అడుగుతారు
- బ్లాక్‌మెయిల్ రాజకీయాల్లో రఘునందన్‌రావు దిట్ట
- మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి
- సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారంలో మెదక్ పార్లమెంట్ స్థాయి సమావేశం

వర్గల్, ఏప్రిల్ 14: ''ఉమ్మడి కుటుంబం నుంచి వచ్చిన వాడిని, కష్టాలు బాధలు ఎలా ఉంటాయో తెలిసినవాడిని, కలెక్టర్‌గా పనిచేసినప్పుడు ప్రజల మధ్యలో తిరిగి వారి సమస్యలను పరిష్కరించా. ఇప్పుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునందుకొని మెదక్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్నా.. నన్ను ఆశీర్వదించండి'' అని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నాయకులు, ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం వద్ద గల శ్రీలక్ష్మీమాధవ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మెదక్ పార్లమెంట్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసినప్పుడు ప్రజల బాధలు, సమస్యలు ఎలా ఉంటాయో తెలుసుకున్నానన్నారు. సేవ చేయాలనే లక్ష్యంతో కేసీఆర్ పిలుపు మేరకు ప్రత్యక్ష రాజకీయాలకు వచ్చానని చెప్పారు. మీ బిడ్డగా, మీ అన్నగా, మీలో ఒకడిగా ఆశీర్వదిస్తే జీవితాంతం సేవచేస్తానన్నారు. తెలంగాణలో ఎండాకాలం వచ్చిందంటే తాగడానికే నీళ్లు ఉండని గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు గోదావరి నీళ్లు తాగించిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కరువు నేలపై గోదావరి జలాలు పారించిన బీఆర్ఎస్ పార్టీకి ఓటువేయాలా? కరెంట్ కోతలు, కరువు కాటకాలు తెచ్చిన కాంగ్రెస్‌కు ఓటు వేయాలా? మతాలపేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టే బీజేపీకి ఓటు వేయాలా ప్రజలు తెలుసుకునే సమయం వచ్చిందన్నారు. రఘునందన్‌రావు బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకొంటున్నాడని ఆరోపించారు. కుటుంబ సభ్యుల అనుమతితో రూ.100 కోట్లతో నిరుద్యోగుల కోసం కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తానన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు జహంగీర్, మాదాసు శ్రీనివాస్, జడ్పీటీసీలు అర్జున్‌గౌడ్, బాలుయాదవ్, ఎంపీపీలు లతారమేశ్‌గౌడ్, లావణ్యాఅంజన్‌గౌడ్, జిల్లా నాయకులు నాగరాజు, ములుగు, వర్గల్ మండలాల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ కమిటీల అధ్యక్షులు, మాజీ ప్రజాపతినిధులు పాల్గొన్నారు.


వర్గల్ మండలం గౌరారంలో మాట్లాడుతున్న మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

గౌరారంలో సమావేశానికి హాజరైన ములుగు, వర్గల్ మండలాల నాయకులు, కార్యకర్తలు

గీత కార్మికులను ఆదుకుంటాం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శివారులో దగ్ధమైన తాటి, ఈత వనాల సందర్శన

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శివారులో గీత కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఏప్రిల్ 14: తాటి, ఈత వనాలు దగ్ధం కావడంతో నష్టపోయిన కల్లు గీత కార్మికులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ శివారులో ఇటీవల దగ్ధమైన తాటి, ఈత వనాలను ఆయన సందర్శించారు. గీత కార్మికులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాటి, ఈత వనాలు కాలిపోవడంతో గీత కార్మికులు ఉపాధి కోల్పోయారని, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అగ్ని ప్రమాదమా, కుట్రపూరితంగా జరిగిన ఘటనా అనే అంశంపై విచారణ జరిపించాలని పోలీసు, ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ప్రకృతి సంపద అయిన తాటి, ఈత వనాలను విరివిగా పెంచడం తప్ప వాటిని దగ్ధం చేయడం సరికాదన్నారు. ఉపాధి హామీ పథకం కింద మొక్కలు పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గీత కార్మికులకు అండగా ఉంటానని, ఉన్నతాధికారులతో మాట్లాడి సహకారం అందేలా కృషి చేస్తానని మంత్రి చెప్పారు. ఆయన వెంట కల్లుగీత కార్మికులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.